క్లుప్తంగా

ప్రమాదకరంగా పిచ్చి చెట్లు



ఫిరంగిపురం: గుంటూరు– కర్నూలు రహదారికి ఇరువైపులా ఏపుగా పిచ్చిచెట్లు, గడ్డి మొలిచింది. దీంతో మూల మలుపులు తిరిగే సమయంలో దూరంగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గడ్డిని మేసేందుకు పశువులు, జీవాలు హఠాత్తుగా రోడ్డు పైకి వస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి తీవ్ర గాయాలైన సంఘటనలు కూడా గతంలో జరిగాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పిచ్చిగడ్డిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న సిమెంట్ లోడు లారీ



ఫిరంగిపురం: సిమెంట్ లోడు లారీ ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ఢీకొన్న సంఘటన మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల రకారం.. మాచర్ల నుంచి సిమెంట్ లోడుతో మంగళగిరి వెళుతున్న లారీ ఫిరంగిపురంలోని పంచాయతీ కార్యాలయం వద్దకు రాగానే రహదారికి మధ్యలోఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో లారీ ముందు భాగం బాగా దెబ్బతింది. డ్రైవర్ శ్రీనివాసరావుకు ఎటువంటి గాయాలు కాలేదు. కాగా డివైడర్ల వద్ద ప్రమాద సూచికలు తెలిపే స్టిక్కర్లు లేకపోవడం, కాంతి తక్కువగా ఉండటంతో కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయని డ్రైవర్లు ఆరోపిస్తున్నారు.

మురుగు నీరుతో ప్రయాణికులకు అవస్థలు



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని కొలనుకొండ– వడ్డేశ్వరం ప్రధాన రహదారిపై నిత్యం మురుగు నీరు ప్రవహిస్తుండడంతో ప్రయాణికులతో పాటు స్థానికులు అవస్థలు పడుతున్నారు. కొలనుకొండ రోడ్డు నుంచి మురుగు నీరు నివాసాల మధ్య నుంచి 500 మీటర్లు ప్రవహిస్తూ చెరువులో కలుస్తోంది. గత రెండు నెలల నుంచి ఇదే పరిస్థితి ఉంది. కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి ప్రధాన రహదారి వెంబడి డ్రెయిన్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



ఫిరంగిపురం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ శివరామకృష్ణ తెలిపారు. స్థానిక పెట్రోలు బంకు సమీపంలో శనివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఇతర పత్రాలు పరిశీలించారు. నిబంధనలు పాటించకపోతే జరిమానా విధిస్తామని తెలిపారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో ప్రమాదాలు కొనితెచ్చుకోవడమే అవుతుందని హెచ్చరించారు. తనిఖీలలో ఏఎస్ఐ పి.జాన్‌ఖాన్, రైటర్ దాసు పాల్గొన్నారు.

సీపీఎం నాయకురాలు మాణిక్యమ్మ మృతి

దుగ్గిరాల: సీపీఎం సీనియర్ నాయకురాలు గొట్టిముక్కల మాణిక్యమ్మ (90)శనివారం దుగ్గిరాల మండలం చిలువూరులో మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని సీపీఎం మండల కార్మిక నాయకులు జెట్టి బాలరాజు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కె. ఉమామహేశ్వరరావు, జయపాల్, కె.భిక్షాలు, వి.మురళి, బి.సాంబశివరావు, బాలచంద్రుడు, పి.అంకాలు దర్శించి, నివాళులర్పించారు. పార్టీకి ఆమె అందించిన సేవలను కొనియాడారు.

టీడీపీ ఆధ్వర్యంలో ఆటోలతో ర్యాలీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంతంలోని గుడిమెడ నుంచి సీతానగరం వరకు టీడీపీ తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో శనివారం ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కాసరగడ్డ శ్రీనివాసరావు, చిగురుపాటి సుబ్బారావు, రాంబాబు, ఖాసింబాబు, ఇప్పటం సొసైటీ చైర్మన్ బాపయ్య, అంకినీడు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

తుళ్లూరులో రాజుకున్న ఆధిపత్య పోరు

- మళ్లీ మొదటికొచ్చిన తమ్ముళ్ల అక్రమ నిర్మాణ వివాదం
- గీతా మందిరం సెంటర్‌లో తాత్కాలిక నిర్మాణంలో వెలిసిన శాశ్వత వినాయక విగ్రహం
- హైకోర్టు ఆదేశాలతో తొలగించేందుకు సిద్ధమైన పోలీసు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది
- ఆర్ఎస్ఎస్ ఎంట్రీతో వారం రోజులు వాయిదా
- తమకు చుట్టుకుంటుందేమోనని పలువురు ఉద్యోగుల ఆవేదన



గీతా మందిరం సెంటర్‌లో ఇటీవల వేసిన తాత్కాలిక నిర్మాణం



లోపల శాశ్వతంగా వెలసిన వినాయక విగ్రహం

తాడికొండ: రాజధాని తుళ్లూరులో తెలుగు తమ్ముళ్ల మధ్య ఆధిపత్య పోరు రాజుకుంది. ఎమ్మెల్యే వర్గం, ఎంపీ వర్గాలుగా విడిపోయారు. ఒకరిపై మరొకరు పైచేయి సాధించుకునేందుకు అధికారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు అది పార్టీకి, పదవుల ఎంపికకే పరిమితం కాగా ఇప్పుడు అది కాస్తా ముదిరింది. తుళ్లూరులోని గీతామందిరం సెంటర్‌లో వినాయక విగ్రహం ఏర్పాటు వేదికగా మారింది. ఏటా ఇక్కడ ఓ వర్గం చవితి ఉత్సవాలకు తాత్కాలిక షెడ్డును ఏర్పాటు చేసి కార్యక్రమాలు నిర్వహిస్తుంటుంది. అయితే, అధికారం వచ్చిందే తడువుగా అక్కడ ఈ ఏడాది తాత్కాలిక షెడ్డు స్థానంలో రేకుల షెడ్డు వెలసింది. అందులో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుండగా.. ఎమ్మెల్యే వర్గం దీనిపై అధికారులను ఆశ్రయించి తొలగించేందుకు యత్నించింది. నిర్వాహకుల మధ్య పెద్ద యుద్ధం నడిచింది. ఒకరినొకరు దూషించుకునే స్థాయికి వచ్చి రాజకీయ జోక్యంతో తాత్కాలికంగా విరమించారు. అయితే, వినాయక ఉత్సవాల వరకే దీన్ని పరిమితం చేసి తదనంతరం తొలగించాలని పోలీసులు చెప్పారు.

నిర్మాణం తొలగించాలని హైకోర్టు ఆదేశం

దీనిపై ఇరువర్గాలు హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు నిర్మాణం తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. ఆ దిశగా చర్యలు తీసుకునే క్రమంలో కార్యదర్శిపై ఒత్తిడి రావడం హైకోర్టు ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆలస్యంపై అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది.దీంతో కార్యదర్శి ''నా ఉద్యోగానికి ఏదైనా హాని జరిగితే మీ అందరి పేర్లు రాసి ఆత్మహత్య చేసుకుంటా''నని ఫోన్‌లో వాట్సాప్ స్టేటస్ పెట్టడంతో వైరల్‌గా మారింది.



ఇటీవల కార్యదర్శి పెట్టిన వివాదాస్పద స్టేటస్

అధికారులకు షాక్

నిమజ్జనోత్సవాలు ముగిసిన వెంటనే తొలగిస్తారని చూసిన అధికారులకు వెంటనే మరో రూపంలో షాక్ తగిలింది. అందులో అమ్మవారి ఉత్సవాలకు విగ్రహం ఏర్పాటు చేయడంతో మళ్లీ వాయిదా పడింది. దసరా ఉత్సవాలు ముగిసినందున విగ్రహం తొలగించేందుకు శనివారం అధికారులు సిబ్బంది, బందోబస్తుతో అన్ని ఏర్పాట్లు చేశారు. నిర్మాణంలో వినాయక విగ్రహం వెలిసింది. దీనికి తోడు ఉన్నట్టుండి ఆర్ఎస్ఎస్ ఎంట్రీతో తాత్కాలిక నిర్మాణం తొలగింపు ప్రక్రియ మళ్లీ వాయిదా పడింది. ఈ వ్యవహారంతో తమ్ముళ్ల మధ్య ఆధిపత్య పోరు అధికారులకు ముచ్చెమటలు పోయిస్తోంది. ఓ వైపు కోర్టు మొట్టికాయలు, మరో వైపు ఎంపీ, ఎమ్మెల్యే వర్గాల ఒత్తిళ్లతో తలలు పట్టుకుంటున్నారు. కరవమంటే కప్పకు, విడవమంటే పాముకు కోపం అనే చందంగా తయారైన రాజధాని గిల్లికజ్జాలు ఏకంగా పార్టీ మండల అధ్యక్షుడు ఎంపికపై కూడా పడ్డాయి. ఇకనైనా అధికారులు హైకోర్టు ఆదేశాలు అమలు చేస్తారా లేదో వేచి చూడాల్సిందే !

కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చాలి



శిబిరంలో కార్మికులకు మద్దతు తెలుపుతున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. కార్మికుల దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్టు తీర్పుల ప్రకారం న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం మాత్రమే వారు అడుగుతున్నారని, ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన కోరారు. ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, గురవయ్య, ఆశీర్వాదం, కార్మికులు పిచ్చయ్య, నాగేశ్వరరావు, సాంబశివరావు, ఇశ్రాయిల్, రమాదేవి, దుర్గాభవాని, శివకుమారి, సారమ్మ, ఇమాంబి, కాసమ్మ, రిబ్కా, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

రాజధానిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

తాడికొండ: రాజధానిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆయన శనివారం తుళ్లూరు, తాడికొండ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. క్రైమ్ రేటు ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిథిలావస్థకు చేరిన పోలీస్ క్వార్టర్స్‌ను తనిఖీ చేశారు. నూతన భవనం లేదా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే దానిపై సిబ్బందిని ఆరా తీశారు. తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో మూలనపడిన వాహనాలను పరిశీలించారు. రాజధాని నేపథ్యంలో ఇక్కడ పరిస్థితులు, ఇతర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నాక తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు రావడం ఇదే మొదటిసారని తెలిపారు. జిల్లాలో తుళ్లూరు పోలీస్ స్టేషన్ చాలా ముఖ్యమైనదని, సెక్రటరియట్, హైకోర్టు ఈ పరిధిలోనే ఉండటంతో అప్రమత్తంగా ఉంటున్నట్లు చెప్పారు. లా అండ్ ఆర్డర్ సమస్య రాకుండా చర్యలు తీసుకున్నామని, తుళ్లూరులోని కొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు కూడా పెట్టించినట్లు తెలిపారు. మరికొన్నింటిని సీఆర్డీయే ద్వారా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.



తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో మూలనపడిన వాహనాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

త్వరలో సిబ్బంది నియామకం

తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో 50 శాతం సిబ్బంది కొరత ఉందని త్వరలోనే భర్తీ చేస్తామని ఎస్పీ తెలిపారు. రాజధానిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో నిత్యం నేరాలపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. అనేక కంపెనీలు పనులు చేస్తూ ఉన్నాయని, వాటికి ఆటంకం కలుగకుండా చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందితో చర్చించినట్లు వివరించారు. ఈ ప్రాంతంలో డ్రోన్‌లతో నిఘా పటిష్టం చేస్తామని వెల్లడించారు. ప్రతి రోజూ సీఎం, హైకోర్టు జడ్జిలు, అధికారులు, సామాన్య ప్రజలు ప్రయాణిస్తుంటారని, ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించినట్లు ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, తాడికొండ సీఐ కె.వాసు, సీఐలు కె. శ్రీనివాసరావు, అంజయ్య, ఎం. శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రంప్ విధానాలను భారతీయులంతా వ్యతిరేకించాలి

తాడేపల్లి రూరల్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలను భారత పౌరులందరూ వ్యతిరేకించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ పిలుపునిచ్చారు. ఉండవల్లి సెంటర్‌లోని సీపీఎం కార్యాలయంలో శనివారం కుంభ ఆంజనేయులు అధ్యక్షతన పార్టీ రాజధాని డివిజన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ అదనపు సుంకాలు పెంచి భారత్‌ను అదుపు, ఆజ్ఞల్లో ఉంచుకోవాలని ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలపై కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడం సరైనది కాదని పేర్కొన్నారు. సామ్రాజ్యవాద దేశమైన అమెరికా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, దాన్నుంచి బయట పడేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలపై అదనపు సుంకాలు విధిస్తోందని వివరించారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. రవి మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి చూపించడం లేదని విమర్శించారు. పేదలకు ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఎం నేతలు భాగ్యరాజు, నవీన్ ప్రకాష్, వల్లభాపురం వెంకటేశ్వరరావు, పేరం బాబూరావు, చెంచయ్య, రామకృష్ణ, జానీ, పార్వతి, షేక్ ఖాదర్ బాబా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

దుండగులను కఠినంగా శిక్షించాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్



ప్రకాష్

తాడేపల్లి రూరల్: అంబేడ్కర్ విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్ డిమాండ్ చేశారు. తాడేపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలం, దేవళంపేట గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి జరిగిన అవమానం దళిత మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో అంబేడ్కర్ విగ్రహాలను రక్షణ లేకుండా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు సుధాకర్‌బాబు నేతృత్వంలో అన్ని అంబేడ్కర్ విగ్రహాల వద్ద ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పంటించడం దారుణం



షేక్ సుభాని

దుగ్గిరాల: అంబేడ్కర్ విగ్రహంపై పెట్రోల్ పోసి తగలబెట్టడం దారుణమని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని తీవ్రంగా ఖండించారు. ఆయన శనివారం దుగ్గిరాలలో మీడియాతో మాట్లాడారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలో గుర్తు తెలియని దుండగులు అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడం అంటే రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై చేసిన దాడిగానే పరిగణించాలని ఆయన పేర్కొన్నారు. న్యాయం, సమానత్వం, స్వేచ్ఛకు ప్రతీకలుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని దహనం చేయడం అత్యంత బాధాకరమని తెలిపారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'ఆటో డ్రైవర్ల సేవ'లో పుస్తక ఆవిష్కరణ

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అధికారులు, పలు రాజకీయ పార్టీల నాయకులు 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. మంగళగిరి నగర పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఎదుట ఉన్న రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు కళావేదికలో శనివారం ఆటో డ్రైవర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి పలు రాజకీయ పార్టీనాయకులు, ఎంటీఎంసీ అధికారులు హాజరయ్యారు. కమిషనర్ అలీమ్ బాషా మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల సేవ పథకంలో లేనివారు సంబంధిత అధికారులను సంప్రదించి చేరే అవకాశముందని పేర్కొన్నారు. అనంతరం 2,291 ఆటో డ్రైవర్లకు గాను 3,43,65,000 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, టీడీపీ, బీజేపీ నాయకులు, ఎంటీఎంసీ అధికారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంటీఎంసీ అధికారులు, రాజకీయ నాయకులు, ఆటో డ్రైవర్లు

బాలకృష్ణ నుంచి పురస్కారాన్ని వెనక్కితీసుకోవాలి



నాగరాజు మాదిగ

దుగ్గిరాల: బాలకృష్ణకు ఇచ్చిన పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ ఏపీ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజుమాదిగ డిమాండ్ చేశారు. దుగ్గిరాల మండలం చిలువూరులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయంగా పిస్టల్‌తో కాల్చి కొంత మంది మరణానికి కారణం అయిన బాలకృష్ణకు పురస్కారాన్ని ఎలా ఇస్తారని ప్రశ్నించారు. నాటి ప్రభుత్వ అండదండలతో డాక్టరు ద్వారా తనకు మెంటల్ ఉందని సర్టిఫికెట్ పొందిన బాలకృష్ణకు కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం భారత అత్యున్నత పౌర పురస్కారానికి ఎలా ఎంపిక చేస్తుందన్నారు. మానసికస్థితి సరిగా లేని వ్యక్తి దేశ అత్యున్నత పురస్కారానికి ఎలా అర్హుడని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. ఆశ్రిత పక్షపాతానికి, కుల వివక్షకు పాల్పడుతోందని తెలిపారు.


కాపుల సమస్యల పరిష్కారానికి కృషి

తెనాలిఅర్బన్: కూటమి ప్రభుత్వ విజయానికి కృషి చేసిన కాపులకు సమస్యలు సృష్టించడం మంచి పద్ధతి కాదని కాపు జేఏసీ వ్యవస్థాపకులు చందు జనార్దన్ పేర్కొన్నారు. వంగవీటి రాధా రంగా స్మారక కాపు యువజన సేవా సమితి వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో సోమవారం బోసురోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపుల హక్కుల సాధన కోసం ఇప్పటికే ప్రభుత్వ పెద్దలకు మెమోరాండాలు అందజేసినట్లు తెలిపారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల వారి రిజర్వేషన్ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాపుల ఆకాంక్షలు నేరవేర్చే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. శివశంకర్ మాట్లాడుతూ కాపు జేఏసీని ఏర్పాటు చేసి హక్కుల సాధన కోసం నిరంతరం జనార్దన్ పోరాటం చేస్తున్నాయని కొనియాడారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో శెట్టిపల్లి సుబ్రహ్మణ్యం, పేటేటి రవికుమార్, కమ్మెల రజిని, కమ్మెల శ్రీనివాసరావు, పెద్దిశెట్టి హనుమంతరావు, తవిటి భాస్కరరావు, నాగం రాంజీ, మారుతి పాల్గొన్నారు.



జనార్దన్‌ను సన్మానిస్తున్న శివశంకర్

శివాలయం దేవస్థాన చైర్మన్ సాంబయ్య మృతి



తెనాలి టౌన్: రూరల్ మండలం ఖాజీపేట కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయం (శివాలయం) ట్రస్ట్ బోర్డు చైర్మన్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు రాచర్ల సాంబయ్య (85) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో శివాలయం అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆయన భౌతికకాయాన్ని దుగ్గిరాల మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, పలువురు పెద్దలు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శ్రీకాళీమాత ఆలయంలో ముగిసిన ఉత్సవాలు

తెనాలి: స్థానిక శివాజీచౌక్‌లోని కాళీమాత దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ముగిసిన సందర్భంగా శనివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ముఖ్యఅతిథిగా హాజరై, అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. దేవస్థానం కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్, యర్ర శ్రీనివాసరావు, అడపాల నాగేశ్వరరావు, కందేపి సీతారామయ్య, పాటిబండ్ల గోపి, నక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి, నిమజ్జనం చేశారు.



8న తెనాలిలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్

తెనాలి అర్బన్: కె.ఎస్.కె.విద్యాసంస్థల సీఈవో డాక్టర్ కత్తెర డేవిడ్ యశ్వంత్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న ఐతానగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు కల్యాణ మండపంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపును నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. జనరల్ మెడిసిన్, గైనిక్, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, డెర్మటాలజీ, పల్మనాలజీ తదితర వైద్యులు అందుబాటులో ఉండి సేవలందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

పన్నుల వసూలు వేగవంతం చేయండి

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలోని ఇంటి, నీటి, కుళాయి, ఖాళీ స్థల పన్నులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పల నాయుడు ఆదేశించారు. రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ ఉద్యోగులతో శనివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు తెనాలి పట్టణంలో జరిగిన పన్నుల చెల్లింపులపై ఆరా తీశారు. కొత్త అసెస్మెంట్లకు త్వరగా పన్నులు విధించాలని సూచించారు. అసెస్మెంట్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్వో రాంప్రసాద్, ఆర్ఐలు కోటేశ్వరరావు, రాజేష్ కన్నా పాల్గొన్నారు.

వయసు మళ్లిన వారికి ఆరోగ్య జాగ్రత్తలు అవసరం

బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల ఉచిత వైద్యశిబిరంలో వీవీ జగదీష్‌కుమార్

తెనాలి: ఆరోగ్యానికి మించిన సంపద లేదని, ప్రతివారూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని భారతీయ స్టేట్‌బ్యాంక్ తెనాలి రీజినల్ మేనేజర్ జగదీష్‌కుమార్ అన్నారు. ముఖ్యంగా వృద్ధులు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారతీయ స్టేట్ బ్యాంక్ దేశవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కొత్తపేటలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బ్యాంక్ విశ్రాంత సిబ్బందికి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రీజినల్ మేనేజర్ జగదీష్‌కుమార్ ప్రారంభించారు. బ్యాంకు ఆదేశాలపై తెనాలితోపాటు రీజినల్ పరిధిలోని పొన్నూరు, బాపట్లలోనూ వైద్యశిబిరాలను నిర్వహించినట్టు చెప్పారు. రమేష్ హాస్పటల్స్ సహకారంతో డాక్టర్ మహిధర్ పర్యవేక్షణలో 70 మందికి పైగా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. అనంతరం మాట్లాడుతూ అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అత్యవసరమైన వారికి మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. బ్యాంక్ ప్రధానశాఖ అధిపతి వాసుదేవరావు, ముఖ్య కార్యనిర్వహణాధికారి తిరుమలరావు, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది మణికంఠ, బ్యాంక్ మార్కెటింగ్ కన్సల్టెంట్ సాయి లక్కరాజు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో పరీక్షలు

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



కొల్లిపర: మండల పరిధిలోని దావులూరిపాలెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో దేవరకొండ మంగమ్మ, నగ్మాకు చెందిన రెండు పోర్షన్ల పూరిల్లు అగ్నికి ఆహుతి అయింది. దీంతో ఆ కుటుంబం కట్టుబట్టలతో మిగిలిపోయింది. వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశాల మేరకు శనివారం పార్టీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటప్పారెడ్డి, నియోజకవర్గం బీసీ నాయకులు మోర్ల శ్రీను బాధితులను పరామర్శించారు. రూ.10,000 నగదుతో పాటు నిత్యావసర సామాన్లు అందజేశారు.